క్లుప్తంగా

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ప్రభుత్వ హోమియో వైద్యురాలు డాక్టర్ రాజేశ్వరి పేర్కొన్నారు. స్థానిక మట్టి మసీదు వీధిలోని మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో శనివారం ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

వైద్య శిబిరం

ప్రొద్దుటూరు క్రైం : ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో గ్రామాల్లో మెరుగైన వైద్యం అందుతోందని డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని దొరసానిపల్లెలో శనివారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు.

7న చలో కడప

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 7న చేపట్టనున్న చలో కడప కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష, కార్యదర్శులు చంటి, సాల్‌మోన్ తెలిపారు. సీఐటీయూ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడారు.

కూరగాయల ధరలను నియంత్రించాలి

పోరుమామిళ్ల : రాష్ట్రంలో కూరగాయల ధరలకు హద్దు లేకుండా పోతోందని, ప్రభుత్వం నియంత్రించడంలో విఫలమవుతోందని సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, పట్టణ సహాయ కార్యదర్శి కేశవ పేర్కొన్నారు. శనివారం వారు పట్టణంలోని కూరగాయల దుకాణాలకు వెళ్లి పరిశీలించారు.

మహిళకు రక్తదానం

పోరుమామిళ్ల : తిమ్మారెడ్డిపల్లెకు చెందిన గర్భిణి లక్ష్మికళకు స్థానిక ఆసుపత్రిలో చికిత్స కోసం రక్తం అవసరమైంది. బి.పాజిటివ్ రక్తం కోసం శనివారం బంధువులు రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు నాయబ్‌రసూల్‌ను సంప్రదించగా ఆ గ్రూపు రక్తం ఉన్న మున్వర్‌తో రక్తం ఇప్పించి సహాయం చేశారు. అదే సమయంలో మరో రెండు ఆసుపత్రుల్లో రెండు యూనిట్ల రక్తం అవసరమవడంతో రసూల్ రక్తం ఇప్పించి ఆదుకున్నారు.

కుందూ వంతెనపై రోడ్డుకు మరమ్మతులు

చాపాడు : ప్రొద్దుటూరు – మైదుకూరు జాతీయ రహదారిలోని కుందూ నది వంతెనపై ఏర్పడిన గుంతలకు శనివారం మరమ్మతులు చేపట్టారు. గత కొన్ని రోజులుగా రోడ్డుపై గుంతలు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలను పూడ్చి తారుతో మరమ్మతులు చేశారు.

ఏపీటీఎఫ్ నిరసన

పోరుమామిళ్ల : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని శనివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయనేతలు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు.

సంజీవరాయ స్వామికి పూజలు

రాజుపాళెం : వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాముల ఆలయాల్లో మంగళగిరి డీజీపీ కార్యాలయం ఏజీ లా అండ్ ఆర్డర్ పోలీస్ ఉన్నతాధికారి రవీంద్రబాబు సతీ సమేతంగా స్వాములకు శనివారం పూజలు చేశారు. ఆయన ఆలయంలోకి రాగానే సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు.

సర్వే పూర్తి చేయాలి

ప్రొద్దుటూరు : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 21వ తేదీలోపు ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఇంటింటి సర్వే పూర్తి చేయాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామ్మోహన్ తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో శనివారం సాయంత్రం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఏసీపీ మునిరత్నం, ఎంపీడీఓ రాంతులయ్య పాల్గొన్నారు.

వేతనాలను వెంటనే చెల్లించాలి

ప్రొద్దుటూరు : బదిలీపై వెళ్లిన పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల వేతనాలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామ్ సుందర్‌రెడ్డి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

చాపాడు : చాపాడు, ద్వారకానగరం వద్ద శనివారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప- కర్నూలు జాతీయ రహదారిలోని ద్వారకానగరం వద్ద శనివారం ఉదయం మైదుకూరు నుంచి దువ్వూరుకు బైక్‌లో వెళుతున్న దువ్వూరు మండలం గొల్లపల్లెకు చెందిన నాగమునెయ్యను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతనిని ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించిగా కోమాలోకి వెళ్లినట్లు కుటుంబీకులు తెలిపారు. అలాగే చాపాడు నాలుగు రోడ్ల కూడలిలో శనివారం మధ్యాహ్నం మైదుకూరుకు చెందిన ఆరీఫ్ (21) బైక్‌పై మైదుకూరుకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్‌ను తప్పించబోయి ఇన్నోవా వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆరీఫ్‌ను 108 లో కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు.

సచివాలయాల ద్వారా సత్వర సేవలు

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు : సచివాలయాల ద్వారానే గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని జిల్లెల్ల గ్రామంలో శనివారం రూ.82 లక్షలతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ప్రజలు సర్టిఫికెట్ల కోసం మండల కార్యాలయాల చుట్టు తిరిగే వారని తెలిపారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తమ పరిధిలోని సచివాలయాల్లోనే అవసరమైన అన్ని సేవలు అందుతున్నాయని చెప్పారు. జనవరి 1 నుంచి పింఛన్ రూ.3వేలు ఇస్తామన్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో 110 రకాల జబ్బులకు మందులు ఉచితంగా అందిస్తారన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలందరూ మనస్ఫూర్తిగా మరొకసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

అనంతరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే దృష్టికి పలువురు తమ సమస్యలను తీసుకొచ్చారు. కొందరు తమకు సిమెంటు రోడ్డు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు కావాలని విన్నవించారు. వీటిని పరిశీలించి పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, తహసీల్దార్ రమకుమారి, ఏఓ అమరనాథ్ రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ వీరారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లగట్ల లక్ష్మిరెడ్డి, సచివాలయ కన్వీనర్ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జిల్లా స్థాయి షూటింగ్ బాల్, అత్యాపాత్యా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా నైపుణ్యం పెంపొందించుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. షూటింగ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 12, 13 తేదీల్లో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో, అత్యాపాత్యా పోటీల్లో ప్రతిభకనబరిచిన క్రీడాకారులు 19, 20 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ పోటీలను ప్రధానోపాధ్యాయుడు గుర్రప్ప, అత్యాపాత్యా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేంద్రుడు, వ్యాయామ ఉపాధ్యాయులు శివారెడ్డి, నడిగడ్డ సుధాకర్, అనిల్‌కుమార్, లక్ష్మీదేవి, నాగేశ్వరరావులు పర్యవేక్షించారు.

మహిళా సంక్షేమం ముఖ్యమంత్రి ఆశయం

ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : మహిళల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. శనివారం స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో జరిగిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బద్వేలు, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి. కోడూరు మండలాలకు చెందిన అంగన్వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కల్లూరి రమణారెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ–1 సీఎం బాషా, వైస్ ఎంపీపీ–2 చెన్ను రాజశేఖర్, రంగసముద్రం సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, పాల్గొన్నారు.



కిట్స్ అందిస్తున్న గోవిందరెడ్డి, విజయప్రతాప్‌రెడ్డి

ప్రొద్దుటూరు : తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ హైమావతి తెలిపారు. స్థానిక సంజీవనగర్ సెక్టార్ పరిధిలోని గోకుల్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.

రాజుపాళెం : గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంతో ఉండాలని ప్రభుత్వం వారికి సంపూర్ణ పోషకాలు అందిస్తోందని మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి అన్నారు. రాజుపాళెంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి

దువ్వూరు : మణిపూర్‌లో జరిగిన సంఘటనల్లో దోషులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ ఆధ్వర్యంలో దువ్వూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన తెలిపారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జయరాం మాట్లాడారు. కార్యక్రమంలో రామసుబ్బమ్మ, జయలక్షుమ్మ, ఇందిరమ్మ, గంగలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక రామేశ్వరంలోని ఎస్‌పీసీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కెరీర్ గైడెన్స్ పుస్తకాన్ని ఉచితంగా విద్యార్థులకు అందించారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధిక శ్రావణ మాసం మూడవ శనివారం సందర్భంగా వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

అణు శక్తిని శాంతి కోసమే ఉపయోగించాలి

మైదుకూరు : అణు శక్తిని శాంతి కోసమే ఉపయోగించాలని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని జీవీ సత్రం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో హిరోషిమా డే నిర్వహించారు. ఈ సందర్భంగా అణుశక్తి – వాటి ఫలితాలు అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షురాలు బీఎల్ పార్వతి పాల్గొన్నారు.

వైభవంగా హుసేన్‌పీర్ దర్గా ఉరుసు



ఉరుసులో భాగంగా స్వామి సమాధి వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న స్వామి వారసులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని దర్గావీధిలో వెలసిన హుసేన్ పీర్ దర్గా 198వ ఉరుసు మహోత్సవాలు స్వామి వారసులు దర్గా రహమతుల్లా సాహెబ్, దర్గా షఫివుల్లా సాహెబ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దర్గాను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. కుల, మతాలకు అతీతంగా భక్తులు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు దర్గా ఆవరణలో అన్నదానం నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి వారికి గంధం ఎక్కించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్వామి వారసులు దర్గా మహమ్మద్ కరీముల్లా, దర్గా మున్వర్, దర్గా సలీం, ఆర్గనైజర్లు అన్వర్‌బాషా, సిమెంట్ షరీఫ్, అంజాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శనివార వ్రతం

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తులసి సురేష్‌బాబు అధ్యక్షతన శ్రావణ 2వ శనివార వ్రతం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ కార్యదర్శి జనార్ధన్‌శెట్టి, జాయింట్ సెక్రటరి శ్రీరాం ప్రసాద్, కమిటీ సభ్యులు వ్రతంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

బద్వేలు అర్బన్ : ఈ నెల 10వ తేదీన జరగనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1 నుండి 19 సంవత్సరాలలోపు పిల్లలకు, కిశోర బాలికలకు అల్బెండజోల్ మాత్రలు ఇస్తామన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, టీచర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ఈ మాత్రలను పిల్లలకు మింగించాలన్నారు. ఈ మాత్రల వలన విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు. అనంతరం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్నస్వర్ణలత, వైద్యులు డాక్టర్ అఫ్తాఫ్, డాక్టర్ సౌమ్య, సీనియర్ అసిస్టెంట్ శారదమ్మ, సీహెచ్ఓ చంద్రావతి, వెంకటమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



నులిపురుగుల నివారణ కార్యక్రమం పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా అదనపు డీఎంహెచ్ఓ

అభివృద్ధిలో వ్యత్యాసం చూడండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్ యాదవ్

ప్రొద్దుటూరు : అభివృద్ధిలో గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని గమనించాలని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తెలిపారు. ప్రొద్దుటూరు మండల సమావేశం శనివారం ఎంపీడీఓ సభాభవనంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలకు సంబంధించి సీఎం జగన్ మార్కు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి , పశువైద్యాధికారి సరస్వతి, వైఎస్సార్ కాంత్రి పథం సీఓ రత్నాకర్ , డిప్యూటీ తహసీల్దార్ జె.మనోహర్‌రెడ్డి, ట్రాన్స్‌కో రూరల్ ఏఈ నరసింహారెడ్డి మాట్లాడారు. జెడ్పీ వైస్ చైర్మన్ జేష్టాది శారదా, ఇన్‌చార్జి ఎంపీడీఓ రాంతులయ్య, వైస్ ఎంపీపీ దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శనివారం భూమి పూజ చేశారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి మల్లేలమ్మ గుడి వరకు రూ.83 లక్షలతో రోడ్డు, డ్రైనేజి కాలువలను నిర్మించనున్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈఈ లక్ష్మీనరసింహులు, గోపవరం సర్పంచ్ గద్దా మోషా, వైస్ సర్పంచ్ రాఘవరెడ్డి, ఎంపీటీసీలు వసుంధర రాజకుళ్లాయప్ప, రవి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ నాగశేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం

స్థానిక శాస్త్రీనగర్‌లోని రాజరాజేశ్వరి ఆలయాన్ని ఎమ్మెల్యే రాచమల్లు శనివారం సందర్శించారు. ఆలయం ముందు వైపున రోడ్డు నిర్మించాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. ఆయన ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కోనేటి ఓబుళరెడ్డి, ఉపాధ్యక్షుడు బీవీ సుబ్బారెడ్డి, కార్యదర్శి కనపర్తి త్రివిక్రమ్ రెడ్డి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, జిల్లా ప్రభుత్వాస్పత్రి సలహామండలి సభ్యుడు నరాల మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి ..

నాయీబ్రాహ్మణులకు కల్యాణ మండపం నిర్మించి ఇస్తానని ఎమ్మెల్యే రాచమల్లు హామీ ఇచ్చినట్లు రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య తెలిపారు. శనివారం ఎమ్మెల్యే ను ఆయన స్వగృహంలో యానాదయ్యతోపాటు నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.గుర్రప్ప, పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి కిశోర్‌కుమార్, నాయకులు కలిశారు. పట్టణంలో నాయీబ్రాహ్మణులకు కళ్యాణ మండపం, కమ్యూనిటీ హాల్ లేదని వారు ఎమ్మెల్యేకు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే కల్యాణ మండపానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బలపనూరు శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



మామిళ్ళపల్లెలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కలసపాడు : అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో దేవుడిగా నిలిచారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శనివారం మహానందిపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని సాల్మన్‌నగర్, శాంతినగర్, వెంకటేశ్వరకాలనీ, మహబూబ్‌నగర్, మామిళ్లపల్లె, లింగారెడ్డిపల్లె సచివాలయ పరిధిలోని కరణంవారిపల్లె గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, బి.నారాయణయాదవ్, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, దేవసాని శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఎ.విజయభాస్కర్‌రెడ్డి, పుల్లారెడ్డి, థామస్, గంగరాజు, భాస్కర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేరీజు వేసుకోండి.. ఆదరించండి

– ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : టీడీపీ ప్రభుత్వంలో ఏమి అభివృద్ధి జరిగిందో.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏమి లబ్ధి జరిగిందో బేరీజు వేసుకుని రాష్ట్ర అభివృద్ధికి ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆదరించాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి కోరారు. శనివారం సాయంత్రం మండలంలోని గంజికుంట పంచాయతీలో రెండో రోజు ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలోని నల్లపురెడ్డిపల్లె, గంజికుంట, ఎస్సీ కాలనీలు, సుగాలితాండ గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు.

ఎమ్మెల్యేకు జన నీరాజనం :

గంజికుంట పంచాయతీలో పర్యటించిన ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. నల్లపురెడ్డిపల్లెలో పోలు ఉత్తమ రెడ్డి, అంకిరెడ్డి, పల్లె ఉమామహేశ్వర రెడ్డి, లింగందిన్నె ప్రసాద్‌రెడ్డి, అంకిరెడ్డిపల్లె కొండారెడ్డి తదితరులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఎస్సీ కాలనీలో నల్లోల్ల రాజారాం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు గజమాలతో సత్కరించారు. గంజికుంట గ్రామంలో కమలాపురం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో పంచాయతీ నాయకులు మాజీ సర్పంచ్ లెక్కల శివప్రసాద్‌రెడ్డి, లెక్కల వెంకటరెడ్డి, లెక్కల రామ్మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి పాల్గొన్నారు.